క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

మర్రిగూడ: గృహజ్యోతి పథకం కింద లబ్ధిచే కూరని వారు బుధవారం మర్రిగూడ ఎంపీడీఓ కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజే శారు. గతంలో ప్రజాపాలనలో గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందని వారు ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని సూపరింటెం డెంట్ యాకుబ్ తెలిపారు.

లక్ష్మణ్‌ను కలిసిన బండారు ప్రసాద్


వినతిపత్రం అందజేస్తున్న బండారు ప్రసాద్

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి తనకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్‌లో బీజేపీ పార్లమెంట్ బోర్డు మెంబర్ డాక్టర్ లక్ష్మణ్‌ను బుధవారం బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ నాయక్, రావిరాల వెంకట్, గుర్రం వెంకన్న, దాసరి సాయిలు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

శాలిగౌరారం: మండలంలోని గురుజాల గ్రామంలో పునర్నిర్మించిన శ్రీవిశాలక్ష్మిసమేత కాశీ విశ్వనాథేశ్వర ఆలయ ప్రారంభోత్సవంతో పాటూ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈ నెల 25 నుంచి 28 వరకు జరుగనున్నాయి. కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆలయ ప్రాంగణంలో విడుదల చేశారు. ఉత్సవాలకు మండల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు గుండా శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యశర్మ, నక్క మల్లేష్, మారం వేణుగోపాల్‌రెడ్డి, ననుబోతు అంజయ్య, పొన్నబోయిన వెంకన్న, పనికెర కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చిట్యాల : అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సివిల్‌సప్లయీస్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం చిట్యాల మండలంలోని వెల్మినేడు శివారులో సివిల్‌సప్లయీస్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పదిబస్తాల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనం పట్టుబడింది. బియ్యం తరలిస్తున్న బానోతు శంకర్‌ను విచారించగా వెల్మినేడు పరిసర గ్రామాల్లో కొనుగోలు చేసి కోళ్లఫారం నిర్వాహకులకు విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపాడు. వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు డీటీ లింగస్వామి తెలిపారు.

కుక్కల దాడిలో 11 గొర్రెలు మృతి

రామగిరి(నల్లగొండ): కుక్కల దాడిలో 11గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన జక్కల వెంకన్న యాదవ్ గొర్రెలను కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలోని 28గొర్రెలను దొడ్డిలో తోలి ఇంట్లో పడుకున్నాడు. రాత్రి సమయంలో దొడ్డిలోకి ప్రవేశించి మందపై దాడి చేసి 11 గొర్రెలను చంపివేశాయి. సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.

పరీక్ష ప్యాడ్లు అందజేత


పరీక్షప్యాడ్లు అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

నల్లగొండ రూరల్: మండలంలోని దండెంపల్లి హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు తమ సంస్థ తరఫున తగిన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగజ్యోతి, ఎల్లాచారి, లింగస్వామి, అర్జున్, రాజు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

'బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తు సిగ్గుచేటు'

నల్లగొండ: బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తు సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు పోలె జయకుమార్ విమర్శించారు. బుధవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పార్టీ ఆందోళనలు చేయడం సిగ్గుచేటని, బీఆర్ఎస్ ప్రభుత్వమే ఎల్ఆర్ఎస్ తీసుకొచ్చిందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి కార్తీక్, గిరి, కత్తుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంట పొలాలు..


చెర్కుపల్లి శివారులో వరిపంటను గొర్రెలకు మేపుతున్న రైతు


కేతేపల్లిలో అడుగంటిన నిమ్మలమ్మ చెరువు

- కేతేపల్లి మూసీ నాన్ ఆయకట్టులో అడుగంటిన భూగర్భ జలాలు
- పశువులకు మేతగా వరిచేలు
- ఆందోళనలో రైతన్నలు

కేతేపల్లి: భూగర్భ జలాలు పడిపోవడంతో రైతన్నలు వేల రూపాయల పెట్టుబడులు పెట్టి యాసంగిలో సాగు చేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. కేతేపల్లి మండలంలోని మూసీ నాన్ ఆయకట్టు గ్రామాల్లో రైతులు శ్రమించిన పంట ఇంటికి చేరకుండానే మూగజీవాలకు గ్రాసంగా మారుతోంది. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో మండలంలోని గుడివాడ, కొర్లపహాడ్, ఇనుపాముల, బండపాలెం, కొండకిందిగూడెం, కేతేపల్లి, చెర్కుపల్లి గ్రామాల్లో కుంటలు నీరు లేక మైదానాలను తలపిస్తున్నాయి. వ్యవసాయానికి దాదాపు 18 గంటల విద్యుత్ సరఫరా అవుతున్నా భూగర్భ జలాలు అడుగంటడంతో ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.

పొట్ట దశలో ఎండుతున్న వరిచేలు

కేతేపల్లి మండలంలో మూసీ ఆయకట్టు లేని గ్రామాల్లో వ్యవసాయ బావులు, బోర్ల కింద దాదాపు 7వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరిచేలు పొట్ట దశలో ఉన్నాయి. మరో నెల దాటితే పంట చేతికి వచ్చే అవకాశముంది. వరిచేలకు ఇప్పుడే నీరు అధికంగా అవసరం ఉంటుంది. అయితే ఈఏడాది సరైన వర్షాలు లేకపోవడం, ఏఎమ్మార్పీ కాలువలకు నీరు వదలకపోవడంతో ఎన్నడూ లేనివిధంగా ఈసారి వేసవికి ముందే భూగర్భ జలాలు పడిపోయాయి. బోర్ల నుంచి వచ్చే కొద్దిపాటి నీటితో సాగు చేసిన వరిపొలాలకు సరిపడా నీరందడం లేదు. దీనికితోడు ఎండలు ముదరడంతో వందలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. నీళ్లు లేక బత్తాయి, నిమ్మ తోటలు కళ్లముందే ఎండిపోతుండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. కొందరు రైతులు గత్యంతరం లేక ఎండిపోతున్న వరి చేలను పశువులు, గొర్రెలకు మేపుతున్నారు. ఇంకొందరు పశువుల మేతకు అమ్ముకుంటున్నారు. ఆశ వీడని మరికొందరు చేతికొచ్చిన పంటను దక్కించుకోవాలనే తపనతో కొత్తగా బోర్లు వేస్తున్నప్పటికీ చుక్కనీరు రాకపోవడంతో అప్పులపాలవుతున్నారు. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

పశువులను మేపుతున్నాం



యాసంగిలో బోరుబావి కింద నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. సాగుకోసం రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టా. రెండు నెలల క్రితం వరకు బాగానే పోసిన బోరులో ప్రస్తుతం నీరు తగ్గడంతో రెండు ఎకరాల పంట ఎండిపోయింది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. చేసేదేమి లేక ఎండిన వరి పొలాల్లో పశువులను మేపుతున్నాం.
–జటంగి లింగస్వామి, కేతేపల్లి

ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నా



రెండెకరాల భూమిలో నిమ్మతోట సాగు చేశాను. బోరు పూర్తిగా ఎండిపోవడంతో పాటు ఎండలకు చెట్లు వాడు బట్టాయి. చెట్లను కాపాడుకునేందుకు రూ.20వేలు ఖర్చు చేసి ట్యాంకర్‌తో నీటిని అందించా. వేసవి పూర్తియ్యేసరికి మరో మూడుమార్లు నీటిని అందించాలి. ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపితే పరిస్థితి ఇలా ఉండేది కాదు.
–మంటిపల్లి వెంకన్న, ఇప్పలగూడెం

వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

మునుగోడు: పంటల అధిక దిగుబడి కోసం వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు, సూచనలను ప్రతి రైతు పాటించి పంటలు సాగు చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రైతు నేస్తంలో భాగంగా రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను బుధవారం మునుగోడు రైతు వేదికలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ఏడీఏ ఎల్లయ్య, తహసీల్దార్ నరేందర్, ఏఓలు శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్, రేవతి, పశువైద్యాధికారులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, రైతులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.


నకిరేకల్: రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామ రైతు వేదిక భవనంలో బుధవారం రైతు నేస్తం (వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు) కార్యక్రమాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు, ఏడీఏ రామరావు, ఏఓ జానిమియా పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి


నార్కట్‌పల్లి : శివరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో డీఎస్పీ శివరాంరెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో మహాశివ రాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించాలని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డితో కలిసి శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 8వ తేదీన ఆత్మలింగానికి అభిషేకాలు, అనంతరం రాత్రి 9 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. కల్యాణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ట్రస్మా నాయకులు యానాల ప్రభాకర్‌రెడ్డి, బోగరి భిక్షం, ఎండీ అజీజ్, ఆలయ అర్చకులు ఉదయ్‌కుమార్, అజయ్‌కుమార్, డీఈ అశోక్, టూటౌన్ సీఐ డానియల్ కుమార్, ఎస్ఐ రావుల నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, కొప్పు సత్తయ్యగౌడ్, రుద్రసేన సభ్యులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

నార్కట్‌పల్లి : శివరాత్రి సందర్భంగా చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతి జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరగనున్న ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ప్రధాన అర్చకులు రామలింగేశ్వరశర్మ, నాయకులు కృష్ణ, రమేష్, శశిధర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రతి వ్యక్తి విజయం వెనుక మహిళ పాత్ర


నల్లగొండ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుచరిత


చండూరు : కస్తాల గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది


చిట్యాల: తల్లులను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


మర్రిగూడ: మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీపీ, మోహన్‌రెడ్డి, ఐసీడీఎస్ అధికారులు

నల్లగొండ రూరల్: ప్రతి వ్యక్తి విజయం వెనుక స్త్రీ పాత్ర ఉంటుందని డాక్టర్ సుచరిత అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం నల్లగొండ ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యతోనే వివక్ష పోతుందన్నారు. ఆడ పిల్లలు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించేందుకు మానసికంగా శారీరకంగా సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా కీలక అధికారులు మహిళలే ఉండడం ప్రశంసనీయమన్నారు. మహిళలను గౌరవించే కుటుంబాలు, ప్రాంతాల అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మహిళా సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎం. శ్రీదేవి, డిప్యూటీ ఆర్ఎం.మాధవి, శివశంకర్, రాంమోహన్ రెడ్డి, ప్రవీణ్, వెంకటేష్, పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

చండూరు: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. బుధవారం మండల పరిధిలోని కస్తాల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ మహిళలు రాజకీ, విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పిల్లలను పంపే తల్లులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అశోక్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

మర్రిగూడ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించి ముందుండాలని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాలికలపై వివక్ష, బాల్య వివాహాలు పూర్తిగా రూపుమాపేందుకు ప్రతిఒక్కరు చొరవ చూపాలన్నారు. అనంతరం పలువురు మండల స్థాయి అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చినముసయ్య, సీడీపీఓ లావణ్యకుమారి, డీటీ జూటూరు తారకరామన్, వైద్యురాలు రుబీనా, సూపర్‌వైజర్లు మిర్యాల పద్మ, ముమ్మడి యశోద, పంచాయతీ కార్యదర్శులు శిరీష, మౌనిక పలు శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులను నిర్మూలిస్తాం

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో బెల్ట్‌షాపులను పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు రాందాసు శ్రీనివాస్ అన్నారు. బుధవారం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బెల్ట్‌లు నిర్వహించినా, మద్యం అమ్మకాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. కాకులవరం అశోక్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, నరేందర్ రెడ్డి,యాదయ్య, మల్లయ్య, వెంకటేష్, అంజయ్య, యాదగిరి, సుగుణమ్మ, జయమ్మ, రమ్య, సరళ, జ్యోతి, సైదమ్మ, రజితలు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం


నేరడ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిట్యాల : మండలంలోని నేరడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా అలరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాజీ సర్పంచ్ దుబ్బాక శోభావెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ వి.నర్సింహ, దుబ్బాక జితేందర్‌రెడ్డిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.సత్తయ్య, ఉపాధ్యాయులు ఎస్ మాధవీలత, ఎస్.వనజ, ఆర్.రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మర్రిగూడ: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 9 వరకు కలెక్టర్ ఆదేశాల మేరకు కృషిచేస్తామని తహసీల్దార్ బి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా 396 ధరణి పెండింగ్ సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట డీటీ జూటూరు తారకరామన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌నాయక్, ఆర్ఐలు బషీర్, పాండురంగారెడ్డి ఉన్నారు.

ఉచిత బీమా కల్పించాలి

చిట్యాల: వ్యవసాయ కార్మికులందరికీ ఉచితంగా ఇరవై లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి నారి అయిలయ్య డిమాండ్ చేశారు. వట్టిమర్తి గ్రామంలో ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీలకు వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వాలను ఆయన అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, గ్రామ అధ్యక్షుడు పులిపెల్లి లలిత, ప్రధానకార్యదర్శి సిరిపంగి కవిత, నూనె పద్మ, బుర్రి శేఖర్‌రెడ్డి, నర్రా అలివేలు, బుర్రి లక్ష్మమ్మ, రెముడాల ముత్యాలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి నివాళి

మర్రిగూడ: ఇందుర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు చెరుకు సురేష్‌గౌడ్ ఇటీవల మృతి చెందాడు. బుధవారం జరిగిన దశదిన కర్మకు మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్ హాజరై సురేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చెరుకు లింగంగౌడ్, బచ్చు రామకృష్ణ, జంగిలి రవి, వెంకటరమణరెడ్డి, వెంకటేష్‌గౌడ్, అశోక్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మర్రిగూడ: మేటిచందాపురం పరిధి ఇందుర్తి గ్రామంలో శ్రీపార్వతీ సమేత శంభులింగేశ్వరస్వామి, శ్రీపార్వతీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు కుంభం వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం తోరణ అలంకరణ, శుక్రవారం కల్యాణం, శనివారం రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

ఎల్ఆర్ఎస్‌పై మాట మార్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ధర్నా
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యేలు


నకిరేకల్: ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మునుగోడు : ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ టూటౌన్: ఎల్ఆర్ఎస్‌పై మాట మార్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం క్లాక్‌టవర్ సెంటర్‌లో నల్లగొండ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో వారు పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం మోపిందన్నారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎల్ఆర్ఎస్‌పై కోర్టు కెక్కిన కోమటిరెడ్డి ఇప్పుడు ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. రైతు రుణ మాఫీ లేదని, రైతు బంధు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో వేసిన ఉద్యోగ నోటిఫికేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చినట్లుగా గొప్పలు చెప్పుకుంటోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవేందర్, మాజీ జెడ్పీటీసీలు తండు సైదులుగౌడ్, అభిమన్యు శ్రీనివాస్, కటికం సత్తయ్యగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దేప వెంకట్‌రెడ్డి, ఐతగోని యాదయ్యగౌడ్, పంకజ్‌యాదవ్, బొర్ర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ధనాన్ని దోచుకునేందుకే ఎల్ఆర్ఎస్ అమలు : కూసుకుంట్ల

మునుగోడు: రాష్ట్రంలోని పేద ప్రజల ధనాన్ని దోచుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అమలు చేస్తోందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మునుగోడులోని అంబేద్కర్ చౌరస్తాలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 25.44 లక్షల మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తుల ద్వారా దాదాపు రూ.20వేల కోట్ల ఆదాయం పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తోందని, ఎన్నికలు ముగిశాక ఏ ఒక్కరికీ ఉద్యోగం రాదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, ఎంపీపీలు కర్నాటి స్వామి, పల్లె కళ్యాణి, జెడ్పీటీసీలు కర్నాటి వెంకటేశం, పాశం సురేందర్‌రెడ్డి, తోకల వెంకన్న, పోలగోని సైదులుగౌడ్, జగదీష్, కత్తుల లక్ష్మయ్య, జంగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై ధర్నా

నకిరేకల్: ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో బుధవారం ధర్నా చేశారు. కార్యక్రమంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకనకదుర్గ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న గ్రామ పెద్దలు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పురాతన శ్రీకనకదుర్గ అమ్మవారి గుడిని రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. దీంతో ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం పట్టణ ప్రముఖులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత గల ఈ ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

డిపో మేనేజర్‌పై ఎస్ఐకి ఫిర్యాదు

నార్కట్‌పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మపై గ్రామస్తులు బుధవారం నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డికి ఫిర్యాదు చేశారు. శ్రీకనకదుర్గ ఆలయం ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీకి ఆనుకొని ఉంటే.. ఆలయం లేదని చెప్పి డిపో మేనేజర్ ఆ స్థలానికి టెండర్లకు పిలిచారని తెలిపారు. సమగ్ర విచారణ జరిపి డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సత్తయ్య, మాజీ సర్పంచ్ అచ్చాలు, మాజీ ఎంపీటీసీ ఐతరాజు యాదయ్య, సత్తయ్య, భిక్షమయ్య, సత్యనారాయణ, రాములు, శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు

రామగిరి(నల్లగొండ): కారు ఢీకొని దంపతులకు గాయాలయ్యాయి. ఈ ఘటన తిప్పర్తి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన మహ్మద్ మన్సూర్ అలీ, తన భార్య జుబేదా బేగంతో కలిసి నల్లగొండ పట్టణం బీటీఎస్‌లో ఉంటున్న కూతురు ఇంటి వద్దకు వచ్చారు. తిరిగి బుధవారం టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెంకటాద్రిపాలెం గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో అనిశెట్టి దుప్పలపల్లి వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొడుకు మహ్మద్ జహంగీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి తిరు కల్యాణం

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామంలో గల లక్ష్మీనారాయణ ఆలయం ఆవరణలో బుధవారం శ్రీ లక్ష్మీనర్సింహస్వామి తిరు కల్యాణం ఘనంగా నిర్వహించారు. పురోహితుల మంత్రోచ్ఛరణలతో దేవతల కల్యాణం నిర్వహించగా పలువురు భక్తులు హాజరై దేవతలకు ఒడి బియ్యం పోశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మొదటి వారంలోనే జీతాలు ఇవ్వడం హర్షణీయం


స్వీట్లు తినిపించుకుంటున్న అంగన్‌వాడీ సిబ్బంది

నల్లగొండటౌన్: అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు గతంలో ఎన్నడూ లేనివిధంగా నెల మొదటి వారంలోనే జీతాలు ఇవ్వడం హర్షణీయమని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు జొన్నలగడ్డ వెంకటరమణ అన్నారు. బుధవారం టీఎన్‌జీఓ భవన్‌లో స్వీట్లు పంపిణీ చేసుకుని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఒక పూట బడులు నిర్వహించాలని, వేసవి సెలవులు ప్రకటించాలని, బీఎల్ఓల విధుల నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మజ్జిగపు సునీత, కోశాధికారి పుట్ట సునీత, అసోసియేట్ ప్రెసిడెంట్ శశికళ, కుర్షిత్ బేగం, కౌసర్, విజయలక్ష్మి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కట్టంగూర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్ఞాన ప్రకాష్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.